తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



తడిచిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి

బుట్టాయగూడెం: అకాల వర్షాల వల్ల ధాన్యం కొనుగోలు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. గురువారం ఆయన జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న పంటలను వెంటనే అంచనా వేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని దిద్దుకూరులో ఎమ్మెల్యే బాలరాజు విలేకర్లతో మాట్లాడారు. రైతులకు ధాన్యం చేతికందే సమయంలో అకాల వర్షాలు కురిసి రైతులను ఇబ్బందులకు గురి చేశాయని తెలిపారు. రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారని, ఏ ఒక్క రైతుకూ పరిహారం అందలేదన్న మాట రాకుండా అధికారులకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు, కోనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు.

రైతులు అధైర్యపడవద్దు

జంగారెడ్డిగూడెం: రైతులు అధైర్య పడొద్దని, ఆదుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట, పంగిడిగూడెం, నాగులగూడెం గ్రామాల్లో గురువారం జెడ్పీటీసీ పర్యటించారు. తడిచిన ధాన్యం, మొక్కజొన్నలను పరిశీలించారు. రైతులు పంటలు నష్టపోకుండా ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని బాబ్జి చెప్పారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యాన్ని ట్రాక్టర్‌పై ఎక్కించి సమీపంలోని రైస్‌మిల్‌కు బాబ్జి దగ్గరుండి పంపించారు. రైసు మిల్లు యాజమాన్యంతో మాట్లాడారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు తమ పంటను సంరక్షించుకోవాలని సూచించారు. రైతులను ఆదుకునేందుకు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాలు ఆర్బీకేల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని బాబ్జీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈర్ల శ్రీనివాసరెడ్డి, పంగిడిగూడెం సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, మల్నీడి బాబి, గంజి వినోద్, నేకూరి కిషోర్, కసుపర్తి రాజేష్, బిందెల మనోజ్, పంపన వీరాస్వామి, సగ్గుర్తి శ్రీను, భీమబోలు పిచ్చయ్య, కటారి శ్రీనివాసరావు, కారుమూరి వెంకటరెడ్డి, బిల్లా సత్తిరెడ్డి, పెనుమాకుల దుర్గయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం, మొక్కజొన్నలను కొనాలి

చింతలపూడి: ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన ధాన్యం, మొక్క జొన్నలను కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని కోరారు. చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో గురువారం వర్షాలకు తడిసిన మొక్కజొన్న పంటను సీపీఐ బృందం పరిశీలించింది. రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే కాలేష, దొంతా కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి కె.గురవయ్య, ఎస్‌కే జాని, తాడిగడప మాణిక్యాలరావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో గడపగడపకూ సంక్షేమం



ఆడమిల్లిలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా



కన్నాపురంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. గురువారం కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామంలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని అన్నారు. ఇంకా అర్హులుంటే వెంటనే అధికారులు దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ ముఖ్యమంత్రి జగన్ అని, నవరత్నాల పథకాలను అమలు చేసి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించారని తెలిపారు. దేశంలో అనేక రాష్ట్రాలు సీఎం జగన్‌ను ఆదర్శంగా తీసుకుని సంక్షేమ పథకాలు అమలుచేసే దిశగా ముందుకెళుతున్నట్టు చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 175 సీట్లు గెలుపు ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, ఆడమిల్లి గ్రామ సర్పంచ్ కేశవరావు, పండు జగదీష్, కోటగిరి కిషోర్ బాబు, షేక్ మీరా సాహెబ్, రాయంకుల సత్యనారాయణ, నల్లూరు ప్రభాకర్, సాయిల స్వాతి, దొడ్డ మనోహర్, గంగారావు, జువ్వాల బాబురావు, బొట్ల లక్ష్మణ్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెరుగుతోన్న ప్రజాదరణ

కొయ్యలగూడెం: ప్రభుత్వ నిర్వహిస్తోన్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పట్ల ప్రజాదరణ పెరుగుతోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వస్తోన్న ప్రజా స్పందన చూసి ప్రతిపక్షాలకు కంటి మీద కునుకు లేకుండా పోయిందని, దీంతో వైఎస్సార్‌సీపీ అమలు చేస్తోన్న కార్యక్రమాలను కాపీ కొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని బాలరాజు అన్నారు. తొలి విడతలో గుర్తించిన సమస్యలను రెండో విడతలోకి వచ్చేసరికి పరిష్కారం అవుతుండటంతో ప్రజలకు గడపగడపకు కార్యక్రమం పట్ల విశ్వాసం నమ్మకం ఏర్పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల మధ్య ఉండాలి, ప్రజల మధ్య గడపాలి అనే సిద్ధాంతంతో తమతో పని చేయిస్తున్నారని తెలిపారు. ప్రతి గడపకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు పూర్తిస్థాయిలో అందించాలనే లక్ష్యమే సీఎం జగన్ పాలన లక్ష్యమన్నారు. పథకాలు అందని వారు ఉండకూడదనే ఉద్దేశంతో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా నిరంతర పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. రాజధానులలో కూర్చుని పాలించే రోజులు పోయాయని ప్రజల మధ్య గడిపే రోజులు వచ్చాయని బాలరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే మాదిగల అభివృద్ధి



చింతలపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఎస్‌పీ మహిళా నాయకులు

చింతలపూడి: మాదిగల రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యమని మాదిగ మహిళ జాతీయ నాయకురాలు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల సమన్వయ కర్త చవటపల్లి విజయ మాదిగ అన్నారు. చింతలపూడి పట్టణంలో వైఎస్సార్ కాలనీలో గ్రామ కమిటీల ఎంపిక సమావేశం చింతలపూడి నియోజకవర్గ ఎంఎస్‌పీ కన్వీనర్ కొలికిపాము హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాదిగ మాట్లాడుతూ మన ఓటు మనకే అనే నినాదంతో మంద కృష్ణ మాదిగ ఏర్పాటుచేసిన మహాజన సోషలిస్ట్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ చింతలపూడి మండల కన్వీనర్ పాలిమేర నాగమణి, టి.నరసాపురం ఎంఎస్‌పీ కన్వీనర్ కొమ్ముకూరి సుగుణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం బలోపేతానికి కృషి



సొసైటీ చైర్మన్ రాంబాబును అభినందిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార సంఘాలను బలోపేతం చేసి రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ చైర్మన్ దాసరి రాంబాబు అన్నారు. సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి ఆయన మాట్లాడారు. సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, రైతులకు సకాలంలో రుణాలు మంజూరు, ఇతర సేవలు అందిస్తానని తెలిపారు. తనను చైర్మన్‌గా నియమించేందుకు కృషి చేసిన ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు శ్రీనురాజులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దాకారపు సూర్యారావు, పారేపల్లి సత్యనారాయణ, యర్రా గంగాధరరావు, వరికూటి సత్యనారాయణ, తోట రామారావు, కాసగాని రామారావు, గొల్లపల్లి భద్రయ్య, భుజంగరావు, కాల్నీడి రమేష్, దాసరి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయండి



జగనన్న ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బి.రాంబాబు నాయక్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జగనన్న ఇళ్ల నిర్మాణంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, గృహనిర్మాణ శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లులేని ప్రతి పేదవాడికీ సొంతిల్లు ఉండాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్రంలో లక్షలాది ఇళ్లు మంజూరు చేశారని చెప్పారు. అధికారులు ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పని చేసి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపీడీఓ మణికుమారి, గృహనిర్మాణ శాఖ ఏఈ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



అలివేరులో సచివాలయ సిబ్బంది వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌డీఓ రాజు

బుట్టాయగూడెం: సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని డీఎల్‌డీఓ ఎం.రాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం అలివేరు, దొరమామిడి సచివాలయాలను ఆయన గురువారం సందర్శించారు. సిబ్బంది వివరాలు, ప్రజలకు అందుతోన్న పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులు ఉంటే గుర్తించి వెంటనే ఆన్‌లైన్‌లో వారి వివరాలను పొందుపరచాలని ఆదేశించారు. దొరమామిడి శివారులో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. తడి, పొడి చెత్తను సేకరించి వాటి ద్వారా ఎరువుల తయారీకి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ అనిల్, కార్యదర్శులు కిరణ్, రామకృష్ణ, బుజ్జమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాలబాలాజీ కల్యాణోత్సవాలు



సరిపల్లి రోడ్డులో కొలువుదీరిన అప్పనపల్లి బాలబాలాజీ

కొయ్యలగూడెం: బయ్యనగూడెం - సరిపల్లి రోడ్డులో కొలువుదీరిన అప్పనపల్లి బాలబాలాజీ 42వ కల్యాణ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని ఈ నెల 9వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 5వ తేదీ రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం, ఆరో తేదీ రాత్రి 7 గంటలకు భక్తి రంజని కార్యక్రమాలు, నిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రసాద వితరణ ఆఖరి రోజు సాయంత్రం 6 గంటల నుంచి మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొంది.

మేడే స్తూపాన్ని పునర్నిర్మించాలి

ఏలూరు (టూటౌన్): మేడే సందర్భంగా మున్సిపల్ కార్మికులు తమ కష్టార్జితంతో ఏలూరు పంపుల చెరువు రోడ్డులోని వెహికల్ షెడ్డు వద్ద నిర్మించిన జెండా దిమ్మెను అక్రమంగా కూల్చివేడాన్ని అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం తీవ్రంగా ఖండించింది. గురువారం సాయంత్రం పంపుల చెరువు వెహికల్ షెడ్డు వద్ద ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ డ్రైవర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు యు.వెంకటేశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకరరావు, సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, మాజీ కార్పొరేటర్ వీరంకి త్రినాథ్, జనసేన నాయకులు శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కోలపల్లి ఉమాశంకర్ మద్దతు తెలిపారు. జెండా స్తూపాన్ని పునర్నిర్మించాలని కోరారు.

ఉపాధి హామీ పని రక్షణ యాత్ర ప్రారంభం

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని రక్షణ యాత్ర నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి తెలిపారు. జంగారెడ్డిగూడెంలో గురువారం ఉపాధి హామీ పని రక్షణ యాత్రను ఆయన ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో రవి మాట్లాడుతూ యాత్ర ఎ.పోలవరం, తాడువాయి, మంగిశెట్టిగూడెం, వేగవరం, చక్రదేవరపల్లి, గురవాయిగూడెం గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజావ్యతిరేక విధానాలతో దేశ ప్రజలపై పెనుబారాలు మోపుతుందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులు పోరాడి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయటానికి బడ్జెట్లో నిధులు తగ్గించిందని, తక్షణమే బడ్జెట్లో రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని, ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టం రద్దు చేయాలని, పాత పద్ధతిలో స్లేషిప్, సమ్మర్ అలవెన్స్, సైట్ సూపర్ వైజర్‌లకు పారిదోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ సమస్యలపై మే 10న జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో ఉపాధి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యాత్రలో అందుగుల ప్రభాకర్‌రావు, తామ ముత్యాలమ్మ, వై.సీత, బి.రాంబాబు, పి.దుర్గారావు, పి.సూర్యారావు, ఎస్‌కే సుభాషిని, వి.గోపి, సత్తిబాబు, బొబ్బిలి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో రెజ్లర్ల పోరాటానికి మద్దతు

ఏలూరు (టూటౌన్) : ఢిల్లీలో రెజ్లర్ల పోరాటానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. రెజ్లర్లపై ఆ సంస్థ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తెలిపారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చింతపూడిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: స్థానిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా గురువారం ప్రారంభించారు. సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలమన్నారు. ప్రధాన కూడళ్లలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు.

నేడు శ్రీకాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం



కాలభైరవస్వామి విగ్రహం

కొయ్యలగూడెం: స్థానిక కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గం మధ్యలో బైనేరు సమీపంలో కొలువై ఉన్న స్వయంభూః పంచముఖి శ్వేతార్క హేరంభ గణపతి, శ్రీచక్ర సహిత చండీ సమేత మహబలేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవం, కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గురువారం చండీ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ, రుద్ర చండీ, భైరవ హోమాలు నిర్వహించారు. చండీ సమేత మహబలేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ధర్మకర్త, అర్చకులు మామిళ్లపల్లి ఆనంద శివాచార్య నేత్రపర్వంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీకాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆనంద శివాచార్య తెలిపారు. మహాపూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పాలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలతో వెళుతున్న రమేష్‌బాబు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నకు అన్నవరం దేవస్థానం ఏసీ రమేష్‌బాబు గురువారం పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని వీటిని అందజేశారు. పట్టు వస్త్రాలను శిరస్సుపై పెట్టుకుని ఆలయానికి విచ్చేసిన ఆయనకు శ్రీవారి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ వైపు వెళ్లే రోడ్డులో ఎన్‌ఆర్‌పేట ప్రధాన రహదారిలో బుధవారం రాత్రి నడిచి వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీకి తరలించారు. లో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిసిన వారు త్రీటౌన్ స్టేషన్ ఫోన్ నెంబర్ 08812 223833కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్‌లోని నార్త్ సెక్షన్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో చెట్ల కొమ్మలు నరకడం, విద్యుత్ లైన్లకు మరమ్మతల నిమిత్తం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అశోక్ నగర్, రామచంద్రరావు పేట, విజయవిహార్ సెంటర్, రమామహల్ సెంటర్, పోలీస్ క్వార్టర్స్, కలెక్టరేట్ కాంపౌండ్, కలెక్టరేట్ వెనుకాల రోడ్డు, ఏటిగట్టు, కొత్త బస్టాండు ప్రాంతం, ఫైర్ స్టేషన్ సెంటర్‌లలో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పెదవేగి : గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత –పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ కోరారు. పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. వేసవిలో మంచి నీటి సమస్యలు లేకుండా చూడాలని, గ్రామాల్లోని రహదారుల వెంబడి చెత్త కుప్పలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సంక్షేమ పథకాలపై కళాజాత



పరింపూడి ఎస్టీ ఏరియాలో కళాజాత ప్రదర్శన కళాకారులతో ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో వెనుకటి తరానికి చెందిన ప్రజలకు తెలియజేయడానికి కళాజాత కార్యక్రమాలు దోహదపడతాయని సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. పరింపూడి పంచాయతీ పరిధి ఎస్టీ ఏరియాలో గురువారం రాత్రి జంగారెడ్డిగూడెంకు చెందిన కృష్ణ కళాజాత బృందం సభ్యులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కళాజాత బృందంలోని సభ్యులు పెన్షన్ మొదలుకొని చేయూత, అమ్మఒడి, విద్యా దీవెన, వంటి పథకాల గురించి కళారూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు కళాజాత బృందం సభ్యులను సత్కరించారు.

ఎంపీపీ వెంకటరెడ్డికి సన్మానం



వెంకటరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

పోలవరం రూరల్: ఏలూరు జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డికు గురువారం పోలవరం మండలం గూటాల గ్రామంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శాలువా కప్పి సన్మానించారు. వెంకటరెడ్డి భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అలాగే పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, పలు శాఖల అధికారులు వెంకటరెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మిడియం సింగరాజు, ఎంపీటీసీ దెగపాటి హరిరామకృష్ణ, పెద్దేపు శ్రీనివాస్, కరిబండి సుబ్బారావు, జల్లేపల్లి శివరామకృష్ణ, కోటం బాబూరావు, ఈవోపీఆర్‌డీ నిఖిల్ మధు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం ఆదాయం రూ.2.78 లక్షలు



పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్న వాహనాల వేలం

టి.నరసాపురం: ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించి గురువారం టి.నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో వేలం నిర్వహించినట్టు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. 15 ద్విచక్రవాహనాల వేలం ద్వారా రూ.2.78 లక్షలు ఆదాయం సమకూరిందని చెప్పారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఈ వేలం నిర్వహించినట్టు తెలిపారు. ఎస్ఈబీ ఎస్సై వై.దుర్గాప్రసాద్, జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, టి.నరసాపురం పోలీసులు పాల్గొన్నారు.

వాహనాల సీజ్

జంగారెడ్డిగూడెం: అతివేగంతో ద్విచక్రవాహనాలు నడుపుతూ, ప్రమాదాలకు కారణమవుతోన్న వారిపై కేసు నమోదు చేసి, నాలుగు వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. గురువారం జంగారెడ్డిగూడెం ప్రధాన సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలను అతివేగంగా నడుపుతూ పట్టుబడ్డ చోదకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ ఆర్థిక సాయం

ఏలూరు (టూటౌన్) : కుష్టు బాధితుల పాదరక్షల నిమిత్తం సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ లెప్రా సొసైటీ నిర్వాహకులకు గురువారం ఆర్థిక సాయాన్ని అందజేసింది. స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో లెప్రా సొసైటీ ప్రాజెక్టు అసోసియేట్ వహీద్ బా షాకు ఈ మొత్తాన్ని అందించింది. బాషా మాట్లాడుతూ లెప్రా సొసైటీ ద్వారా 20 మంది కుష్టు బాధితులకు ఉచితంగా పాదరక్షలు అందించినట్టు చెప్పారు.